ప్రజాశక్తి
సోమవారం 3 నవంబర్ 2025
5
అనంతపురం



'బిటిపి'కి తగ్గిన ఇన్‌ఫ్లో



ఒక గేటు నుంచి విడుదల అవుతున్న నీరు

రాయదుర్గం : భైరవాణితిప్ప ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో తగ్గింది. దీంతో రిజర్వాయర్ నుంచి దిగువకు విడుదల చేసే నీటిని కూడా తగ్గించారు. రిజర్వాయర్ గరిష్ట నీటి నిల్వ మట్టం 1655 అడుగులు కాగా ఆదివారం సాయంత్రానికి 1653.9 అడుగులచే చేరుకున్నట్లు జల వనరుల శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హరీష్ తెలిపారు. రిజర్వాయర్ గరిష్ట నీటినిల్వ సామర్థ్యం రెండు శతకోటి ఘనపుటడుగులు గాక ప్రస్తుతం 1.985 శతకోటి ఘనపుటడుగుల నీరు నిల్వ ఉన్నట్లు తెలిపారు. రిజర్వాయర్‌లోకి 1,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా రిజర్వాయర్ 7వగేటును అడుగు మేరకు ఎత్తి 1,752 క్యూసెక్కులు దిగువకు వదిలినట్లు తెలిపారు.

గుత్తి టౌన్‌బ్యాంకులో అక్రమాలు..!

ఇంటి రుణాల్లో గోల్‌మాల్-మార్కెట్ విలువ కంటే తక్కువగా గృహాల వేలం-లబోదిబోమంటున్న లబ్ధిదారులు



ది గుత్తి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు లిమిటెడ్ గుత్తి ఆర్ఎస్ బ్రాంచి

ప్రజాశక్తి-గుత్తి

ది గుత్తి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకులో అవినీతి, అక్రమాలు చోటు చేసుకుంటున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రిజర్వు బ్యాంకు నిబంధనలను గుత్తి పట్టణ బ్యాంకు అధికారులు బేఖాతారు చేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. గుత్తి ఆర్ఎస్‌లోని ఎంఆర్ పరిశ్రమ ప్రాంతానికి చెందిన పద్మశాలి వాసా శ్రీనివాసులు 18:28 అడుగులు ఉన్న తన ఇంటిని టౌన్‌బ్యాంకులో తాకట్టు పెట్టి రూ.8 లక్షలు రుణం తీసుకున్నారు. ఆ రుణంతో తన ఇంటిని 28:32 అడుగులకు విస్తరించి నిర్మించుకున్నారు. రుణం తీసుకున్న అనంతరం నెలకు రూ.16వేలు చొప్పున 20 నెలలు కంతులు చెల్లించారు. కొన్ని నెలలు అధికంగా కూడా కంతుల సొమ్మును చెల్లించారు. అయితే స్వీట్స్ దుకాణం నిర్వహించే శ్రీనివాసులు అనారోగ్యానికి గురికావడంతో ఆ దుకాణం మూతపడింది. దీంతో బ్యాంకు కంతులను చెల్లించలేకపోయారు. ఖాతాదారుడి డిఫాల్టర్ కింద లెక్క కట్టి అతని నివాసాన్ని వేలం వేసేందుకు బ్యాంకు అధికారులు నిర్ణయించి ప్రకటన కూడా ఇచ్చారు. అయితే శ్రీనివాసులకు ఇంటిని వేలం వేస్తున్నట్లు మూడు లీగల్ నోటీసులు ఇవ్వాల్సి ఉండగా ఒక్క లీగల్ నోటీసు కూడా ఇవ్వలేదు. అలాగే ఇల్లు వేలం వేస్తున్నట్లు ఊరిలో చాటింపు వేయలేదు. సేల్స్ అధికారి, సర్వేయర్ ఇంటిని పరిశీలించి మార్కెట్ విలువకు సంబంధించిన నివేదికను బ్యాంకు అధికారులకు ఇవ్వాలి. అయితే ఎవరూ ఇంటిని పరిశీలించలేదు. అధికారిక లెక్కల ప్రకారం ఆ ఇంటి విలువ రూ.15.68 లక్షలు మార్కెట్ విలువ ఉంది. వేలం సమయంలో ఇంటి యజమాని అక్కడ ఉండాలనే నిబంధన ఉంది. శ్రీనివాసులుకు తెలియకుండా తన ఇంటిని వేలం పేరుతో ఓ వ్యక్తికి రూ.9.80 లక్షలకు అప్పగించారు. వేలం దక్కించుకున్న వ్యక్తి పదిరోజుల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని నిబంధన ఉండగా మూడు నెలల తర్వాత అతను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ మూడు నెలలకు సంబంధించిన రుణం వడ్డీని శ్రీనివాసులుతో బ్యాంకర్లు కట్టించుకున్నారు. అలాగే మూడు నెలలపాటు విద్యుత్ బిల్లులను శ్రీనివాసులే చెల్లించారు. మున్సిపాలిటీ అధికారులు అదనంగా ఏడాదికి సంబంధించి ఇంటి పన్నును కట్టించుకున్నారు. తన ఇల్లు మార్కెట్ విలువ కంటే తక్కువగా వేలం పోవడంతోపాటు అదనపు భారాలు పడడంతో శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తనకు అన్యాయం జరిగిందని విచారణ చేసి న్యాయం చేయాలని డివిజనల్ సహకార అధికారి కె.వెంకటరామిరెడ్డికి బాధితుడు విన్నవించుకున్నారు.

మార్కెట్ విలువ కంటే తక్కువగా వేలం..



నా ఇంటిని ది గుత్తి కో-ఆపరేటివ్ పట్టణ బ్యాంకులో కుదువ పెట్టి రూ.8 లక్షలు రుణం తీసుకున్నా. స్వీట్స్ దుకాణం నిర్వహణతో జీవనం కొనసాగిస్తూ బ్యాంకు రుణంపై 20 కంతులు చెల్లించా. అయితే అనారోగ్యానికి గురికావడంతో మిగిలిన కంతులు చెల్లించలేకపోయా. దీంతో బ్యాంకర్లు నా ఇంటిని మార్కెట్ విలువ కంటే తక్కువగా వేలం వేసి అన్యాయం చేశారు.

పద్మశాలి వాసా శ్రీనివాసులు, గుత్తి ఆర్ఎస్.

అలాగే గుత్తి ఆర్ఎస్‌లోని సుందరయ్య కాలనీలో నివాసం ఉండే సురేష్ అనే వ్యక్తి టౌన్‌బ్యాంకులో తన ఇంటిపై రుణం తీసుకున్నారు. అతను కంతులు చెల్లించకపోవడంతో ఆ ఇంటినీ వేలం వేశారు. రెండు అంతస్తుల గృహం మార్కెట్ విలువ దాదాపు రూ.60 లక్షలు ఉండగా కింద ఇంటికి మాత్రమే మార్కెట్ విలువ కట్టి రెండు అంతస్తుల ఇంటిని కేవలం రూ.49లక్షలకే వేలం వేశారు.

గుత్తి ఆర్ఎస్‌కు చెందిన ఓ వికలాంగురాలు ఇల్లు దాదాపు రూ.60 లక్షలు మార్కెట్ విలువ చేస్తుండగా ఆ ఇంటిని టౌన్‌బ్యాంకు అధికారులు రూ.15 లక్షలకే వేలం వేసినట్లు సమాచారం. ఇలా గుత్తి పట్టణ బ్యాంకు పరిధిలోని చాలా ఇళ్లను వేలం వేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గుత్తి పట్టణ బ్యాంకులో జరిగే అక్రమాలపై డివిజనల్ సహకార అధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నిబంధనల మేరకే వేలం వేశాం

రిజర్వ్ బ్యాంకు నిబంధనల మేరకే తమ బ్యాంకులో రుణాలు తీసుకుని కంతులు చెల్లించని వారి ఇళ్లను వేలం వేస్తున్నాం. తాము కష్టమర్లకు చేయూతను ఇస్తున్నాం. అంతేగాకుండా బ్యాంకు అభివృద్ధికి కృషి చేస్తున్నాం.

మహేశ్వర ప్రసాద్, సిఇఒ
ది గుత్తి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు, గుత్తి.

అక్రమాలు జరిగితే చర్యలు

సహకార బ్యాంకుల్లో 64 చట్టం పరిధిలో ఆస్తులను అక్రమంగా వేలం వేస్తే చర్యలు చేపడతాం. సర్ఫేసి చట్టం కింద స్థిరాస్తుల వేలాలు జరిగితే స్థానిక సివిల్ న్యాయస్థానాలను బాధితులు ఆశ్రయించాల్సి ఉంటుంది.

కె.వెంకటరామిరెడ్డి, డివిజనల్ సహకార అధికారి, అనంతపురం.

కరువు మండలాలను ప్రకటించాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో వెంటనే కరువు మండలాలను ప్రకటించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో ఖరీఫ్‌లో సాగు చేసిన వేరుశనగ, ఇతర పంటలు సకాలంలో వర్షాలు రాకపోవడంతో పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. జులై ఆఖరిలో, ఆగస్టులో కురిసిన వర్షాలకు పంటలు సాగు చేసినా పంట దిగుబడులు పూర్తిగా తగ్గిపోయాయన్నారు. దీంతో అప్పులు చేసి పెట్టుబడి పెట్టిన రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారన్నారు. ముఖ్యంగా ఇటీవల కురిసిన వర్షాలకు తొలగించిన పంటలు, వేరుశనగ, మొక్కజొన్న ఇతర పంటలు తడిసి తీవ్రంగా నష్టం సంభవించిందన్నారు. అయితే రైతులు పెద్దఎత్తున పంటలు నష్టపోయినా ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల జాబితాలో జిల్లాను చేర్చకపోవడం రైతులకు తీవ్ర అన్యాయం చేయడమే అన్నారు. కావున ఇప్పటికైనా జిల్లాలో ఉన్న ప్రజాప్రతినిధులు స్పందించి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం, బీమా వచ్చే విధంగా చూడాలని డిమాండ్ చేశారు.

అమ్మో..కుక్కలు

గుంపులు గుంపులుగా గ్రామసింహాలు
ద్విచక్ర వాహనదారులపై దాడులు
బెంబేలెత్తుతున్న మండలవాసులు

ప్రజాశక్తి-పుట్లూరు

మండల వ్యాప్తంగా విచ్చలవిడిగా తిరుగుతున్న కుక్కలతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. మండలంలో ఎక్కడ చూసినా వీధికుక్కలు గుంపులు గుంపులుగా రోడ్డుపైకి వచ్చి చేరుతూ నడుచుకుంటూ, ద్విచక్ర వాహనదారుల వెళ్తున్న వారిపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. ముఖ్యంగా మండల కేంద్రంలో గుంపులు గుంపులుగా రోడ్డుపైకి వచ్చే కుక్కలను తప్పించబోయి పలువురు ద్విచక్ర వాహనదారులు కింద పడి గాయాలపాలవుతున్నారు. దీంతో రోడ్లపైకి వెళ్లాలంటేనే కుక్కలు ఎక్కడ నుంచి వచ్చి దాడి చేస్తాయోనని భయపడుతున్నారు. ఇక నడుచుకుంటూ వెళ్లే వారిపై కూడా కుక్కలు దాడి చేస్తూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి మండల వ్యాప్తంగా వీధికుక్కలు లేకుండా చూడాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.



పుట్లూరులో రోడ్డుపై ఉన్న వీధికుక్కలు

ప్రిన్సిపల్ అవకతవకలపై అధికారులు మౌనం..!

ప్రజాశక్తి -కణేకల్లు

కనేకల్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ చేసిన అవకతవకలపై అధికారులు మౌనం వీడటం లేదు. నాయకులు జిల్లా కేంద్రంలో ఫిర్యాదు చేసిన ఆయనపై చర్యలు కాదు కదా కనీసం విచారణ కూడా చేయకపోవటంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గెస్ట్ జువాలజీ పోస్టులో జరిగిన అవకతకలపై ప్రిన్సిపల్‌పై వచ్చిన ఆరోపణలపై ఉన్నతాధికారులు కనీస విచారణ నిర్వహించకపోవటం ఏమిటన్న ప్రశ్నలు మండలంలో వినిపిస్తున్నాయి. ఒకరి సర్టిఫికెట్ చూపించి మరొకరితో పాఠాలు చెప్పించడం కూడా తప్పు అయినప్పటికీ ఆ విషయంలో కూడా ఎలాంటి విచారణ లేకపోవటం విచారకరం. ఆసమయంలో గెస్ట్ లెక్చలర్‌కు వచ్చిన వేతనంలో కూడా ప్రిన్సిపల్ చేతివాటం ప్రదర్శించినట్లు ఆరోపణలున్నాయి. అలాగే 2025 జూలై మాసంలో కళాశాల కుర్చీలు అవసరమని ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల వద్ద 5వేల రూపాయలు వసూలు చేశారని, యూనిఫాంకు ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే అధికంగా వసూలు చేశారని ఆరోపణలున్నాయి. ఈ విషయాలపై విద్యార్థి సంఘం నాయకులు జిల్లా కేంద్రంలోని ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఆయనపై విచారణ చేపట్టకపోవడంపై విమర్శలు వినపడుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అవినీతి ఆరోపణ ఎదుర్కొంటున్న ప్రిన్సిపల్ వైఖరిపై విచారణ జరిపి ఆయనపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు



జిల్లా గ్రామ వార్డు సచివాలయాల నోడల్ అధికారి సుధాకర్‌రెడ్డి



ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ప్రజల ముంగిటకే ప్రభుత్వ పాలన అన్న లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నామని జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి సుధాకర్ రెడ్డి తెలిపారు. గతంలో అయితే కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు పొందాలంటే మండల కేంద్రమైన తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లేవారు. ప్రభుత్వం పథకాలు పొందాలంటే ఎంతో వ్యవప్రయాసలకు లోనయ్యేవారు. దీంతో ప్రభుత్వం గ్రామాలలోనే ప్రజలకు సేవలు అందించాలన్న లక్ష్యంతో గ్రామ వార్డు సచివాలయాలు ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఏ పని జరగాలన్నా గ్రామంలో ఉండే సచివాలయాల్లోనే ప్రజలకు సేవలు అందుతున్నాయి. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులు అందుతున్నాయి. గ్రామస్థాయిలోనే విలేజ్ హెల్త్ క్లినిక్ ద్వారా మెరుగైన ఆరోగ్య సేవలు అందుతున్నాయి. అంతేగాక సచివాలయాల ద్వారా నెల నెలా వృద్ధులకు, వితంతు, వికలాంగులకు తదితర పింఛన్లు పంపిణీ జరుగుతుంది. ఈ నేపథ్యంలో జిల్లా గ్రామం వార్డు సచివాలయాల నోడల్ అధికారి సుధాకర్ రెడ్డి ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో పలు అంశాలను ప్రస్తావించారు.

ప్రశ్న : జిల్లా వ్యాప్తంగా ఎన్ని సచివాలయాలున్నాయి? ఎంతమంది సిబ్బంది ఉన్నారు?

నోడల్ అధికారి : జిల్లా వ్యాప్తంగా గ్రామ వార్డు సచివాలయాలు 544 ఉన్నాయి. ఇందులో జిల్లాలోని 32 మండలాలకు గాను జిల్లాను 4 డివిజన్లుగా విభజించడం జరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో 422 గ్రామ సచివాలయాలున్నాయి. పట్టణ ప్రాంతాల్లో 122 సచివాలయాలు ఉన్నాయి. గ్రామీణ సచివాలయాల్లో 2893 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో 3855 మంది పనిచేస్తున్నారు.

ప్ర : సచివాలయాల సిబ్బంది ప్రజలకు అందిస్తున్న సేవలు ఏమిటి?

నోడల్ అధికారి : గ్రామ వార్డు సచివాలయాల వల్ల ప్రజలకు ఎన్నో సేవలు అందుతున్నాయి. కులం, ఆదాయం, తదితర ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్నారు. ప్రభుత్వ పథకాలన్నీ సచివాలయాల ద్వారానే నిర్వహించడం జరుగుతుంది. రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్ కేంద్రాల ద్వారా సేవలు అందుతున్నాయి. ప్రతి నెల 1వ తేదీ ఉదయమే పింఛనుదారులకు పింఛన్లు అందించడం జరుగుతుంది. తల్లికి వందనం, ఆటో డ్రైవర్ల సేవల్లో, స్త్రీ శక్తి పథకం, దీపం పథకం క్రింద మహిళలకు గ్యాస్ సిలిండర్లు అందజేయడం తదితర ప్రభుత్వ పథకాలన్నీ సచివాలయాల ద్వారా నిర్వహించడం జరుగుతోంది.

ప్ర : సచివాలయాల్లో ఉన్న సిబ్బంది ఏయే హోదాల్లో పనిచేస్తున్నారు?

నోడల్ అధికారి : గ్రామీణ సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, సంక్షేమ విద్య అమలు అధికారి, గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ సర్వేయర్లు, గ్రామ వ్యవసాయ అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, ఎఎన్ఎం, గ్రామ మహిళ సంరక్షణ కార్యదర్శి తదితర సిబ్బంది పనిచేస్తున్నారు. అదే పట్టణ ప్రాంత సచివాలయాల్లో వార్డు పాలన అధికారి, సంక్షేమ అమలు కార్యదర్శి, శానిటేషన్, పర్యావరణ పరిరక్షణ కార్యదర్శి, వార్డ్ రెవెన్యూ కార్యదర్శి, వార్డు ప్రణాళిక కార్యదర్శి, వార్డ్ ఎనర్జీ కార్యదర్శి, ఎఎన్ఎం, వార్డు మహిళా సంరక్షణ అధికారి తదితరులు పనిచేస్తారు.

ప్ర : సచివాలయాల పర్యవేక్షణ ఎవరు చేస్తారు?

నోడల్ అధికారి : జిల్లా అధికారిగా నేను పర్యవేక్షిస్తుంటాను. అలాగే ఎంపీడీవోలు, తహశీల్దార్లు కూడా పర్యవేక్షించే అధికారం ఉంటుంది. మొత్తం మీద ఆయా సచివాలయాల పాలన అధికారి పాత్ర ప్రధానంగా ఉంటుంది. సిబ్బంది చేస్తున్న పనులను అధికారులు పర్యవేక్షిస్తుంటారు.

ప్ర : సిబ్బంది కొరత ఉందా? ప్రజలకు మీరు ఇచ్చే సలహాలు సూచనలు ఏమిటి?

నోడల్ అధికారి : గ్రామీణ సచివాలయాల్లో మొత్తం 4620 మంది సిబ్బందికి గాను 2893 మంది పనిచేస్తుండగా 1727 మంది సిబ్బంది కొరత ఉంది. పట్టణ ప్రాంతాల్లో 5860 మందికి గాను 3855 మంది పనిచేస్తున్నారు. 2005 మంది సిబ్బంది కొరత ఉంది. ఈ విషయాన్ని ప్రభుత్వానికి నివేదించాం. ప్రజలు గతాన్ని ప్రస్తుతాన్ని గమనించాలి. గ్రామీణ సచివాలయాల్లోనే ప్రజలకు అవసరమైన పనులు జరుగుతాయి. సమస్య ఏమున్నా సచివాలయ అధికారులను సంప్రదించవచ్చు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సచివాలయాల సేవలను ప్రజలు వినియోగించుకోవాలి.



సిఐటియు మహాసభల సందర్భంగా హిందూపురంలో మహాప్రదర్శన

సమరశీల పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి
సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్. నర్సింగరావు
ఉత్తేజభరితంగా జిల్లా మహాసభ ప్రారంభం
ఎరుపెక్కిన హిందూపురం

ప్రజాశక్తి-హిందూపురం

సమరశీల పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అన్నారు. శ్రీ సత్య సాయి జిల్లా సిఐటియు 10వ జిల్లా మహాసభలు ఆదివారం హిందూపురం పట్టణంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పట్టణంలోని నంది సర్కిల్ వద్ద ఉన్న అంబేద్కర్ భవన్ రైల్వే రోడ్డు మీదుగా ఎన్టీఆర్ సర్కిల్, అంబేద్కర్ సర్కిల్, సద్భవన్ సర్కిల్ మీదుగా తహశీల్దార్ కార్యాలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన బహిరంగసభ వేదిక వరకు వందలాది మంది కార్మికులతో మహా ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రాంగణంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్ పి శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో సి హెచ్ నర్సింగరావు మాట్లాడారు. పోరాటాలతో ఎలాంటి సమస్యలైనా పరిష్కారమవు తాయన్నారు. రూ.300 వేతనంతో ప్రారంభమైన అంగన్వాడీ కార్యకర్తలు ఈ రోజు రూ.11వేలు తీసుకుంటున్నారంటే పోరాట ఫలితమేనని చెప్పారు. ఆశా కార్యకర్తలు రూ.10వేలు వేతనం, గ్రాట్యుటీ, మెటర్నిటీ లీవ్ వంటి సౌకర్యాలను పోరాటాలతోనే సాధించుకున్నామన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులు కూడా అదే బాటలో పోరాడి సమస్యల్ని పరిష్కరించుకుంటున్నారని అన్నారు. సిఐటియు లేకపోతే కేంద్ర ప్రభుత్వం ఈపాటికే ఐసిడిఎస్‌ను ప్రయివేటీకరించేదన్నారు. 75లక్షల మంది సభ్యులు ఉన్న సిఐటియు దేశంలో అతిపెద్ద కార్మిక సంఘంగా గుర్తింపు పొందిందని చెప్పారు. 42 రోజుల పాటు సమ్మె చేసినా స్పందించని వైసిపి ప్రభుత్వాన్ని అంగన్వాడీ కార్యకర్తలు గద్దె దింపారని గుర్తుచేశారు. కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభించే ఏ ప్రభుత్వానికైనా అదే విధంగా కార్మికులు బుద్ధి చెబుతారని అన్నారు. శ్రమజీవుల కష్టాలను గుర్తించని ప్రభుత్వాలు మట్టిలో కలిసిపోతాయన్నారు. గత ప్రభుత్వం హయాంలో విద్యుత్ ఛార్జీలు పెరిగాయని గొంతు చించుకున్న సిఎం చంద్రబాబు నాయుడు 11 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారని తెలిపారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లను ప్రతిపక్ష నేతగా లోకేష్ తీవ్రంగా వ్యతిరేకించారని, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత స్మార్ట్ మీటర్లను ఇంటింటికీ బిగిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం అమలు చేయడం హర్షణీయమని, ఆటో కార్మికుల పొట్ట కొట్టకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రధాని మోదీ చెప్పిన ప్రతి పనికి జీ హుజూర్ అంటు కార్మిక చట్టాలను కాలరాస్తున్నారని విమర్శించారు. కార్మికులు ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న చట్టాల జోలికి వస్తే కార్మికుల సత్తా ఏంటో చూపిస్తామని హెచ్చరించారు. డిసెంబర్ 1నుంచి 4 వరకు విశాఖలో సిఐటియు జాతీయ మహా సభలు నిర్వహిస్తున్నామని, ఈ సభల్లో మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా పోరాటానికి ప్రణాళిక రూపొందించనున్నామని నర్సింగరావు చెప్పారు.

ఉద్యమాలతోనే కార్మికుల బతుకుల్లో మార్పు

కార్మికులు బలమైన ఉద్యమాలు చేయడంతోనే కార్మికుల బతుకులు మారుతాయని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబులు అన్నారు. జిల్లా మహాసభల సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో ప్రధాని నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం కార్మిక వర్గం వ్యతిరేక ప్రభుత్వమని పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తోందని విమర్శించారు. కార్మిక వర్గాన్ని మతపరంగా చీలుస్తూ హిందువుల ఐక్యత పేరుతో మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నారని చెప్పారు. అందుకే మతాలకతీతంగా కార్మిక వర్గం ఐక్యం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు.

జిల్లా అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం

జిల్లా అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జెడ్‌పి శ్రీనివాసులు, ఈఎస్ వెంకటేష్ విమర్శించారు. జిల్లాలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు, దినసరి ఉద్యోగులపై వేధింపులు ఎక్కువయ్యాయన్నారు. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, విఒఎలు, కెజిబివి, మోడల్ పాఠశాలల్లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఉద్యోగాలను కూటమి ఎమ్మెల్యేలు అమ్ముకుంటున్నారని విమర్శించారు. కొత్త ఉద్యోగాలు తీసుకు రాకుండా ఉన్న ఉద్యోగులపై వేధింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ జిల్లా అభివద్ధికి అపారమైన అవకాశాలు ఉన్నాయని చెప్పారు. పది వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తే జిల్లాలోని ప్రతి సెంటు భూమికి సాగునీరు అందించే అవకాశం ఉందని చెప్పారు. శ్రామిక మహిళా జిల్లా కార్యదర్శి దిల్షాద్ మాట్లాడుతు జిల్లా వ్యాప్తంగా ఉన్నా గార్మెంట్స్ పరిశ్రమల్లో మహిళా కార్మికులతో వెట్టి చాకిరి చేయించుకొంటున్నారన్నారు. ఈ మహా సభలో సిఐటియు జిల్లా నాయకులు సాంబశివ, నరసింహులు, బాబావలి, లక్ష్మినారాయణ, ఉషారాని, శ్రీదేవి. సౌభాగ్య, స్థానిక నాయకులు రాము, రామకృష్ణతో పాటు జిల్లా నలుమూలల నుంచి పెద్దఎత్తున అంగన్‌వాడీ, ఆశా, భవన నిర్మాణ కారికులు, బీడి కార్మికులు, సివిల్ సప్లైయి హమాలీలు, మున్సిపల్ కార్మికులు, వివిధ రంగాల స్కీం వర్కర్లు పాల్గొన్నారు.

కదం తొక్కిన కార్మికులు....ఎరుపెక్కిన పట్టణం

సిఐటియు జిల్లా మహా సభల సందర్భంగా వందలాది మంది కార్మికులు కదలి వచ్చారు. దీంతో హిందూపురం పట్టణం ఎరుపెక్కింది. ఎర్ర జెండాలతో రెపరెపలాడింది. నంది సర్కిల్ నుంచి కార్మికులు సభా స్థలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబులు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జెడ్‌పి శ్రీనివాసులు, ఈఎస్ వెంకటేష్ పాటు జిల్లా నాయకులు పాల్గొన్నారు.



మహాసభలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు



మహాసభలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు



నాయకుల అభివాదం

త్వరలోనే 'అనంత' అక్రమ ఆస్తుల చిట్టా

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

త్వరలోనే అనంతపురం మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అక్రమాస్తుల చిట్టాను విప్పుతామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ఆదివారం నగరంలోని 41వ డివిజన్ జనశక్తి నగర్‌కు చెందిన మైనార్టీ నాయకుడు మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో దాదాపు 100 కుటుంబాలు టిడిపిలో చేరాయి. వీరికి ఎమ్మెల్యే దగ్గుపాటి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అనంతపురంలోని 50 డివిజన్లు, 4 పంచాయతీల్లో తామే గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, మైనార్టీలపై చూపుతున్న చొరవ చూసి ఎంతో మంది పార్టీలోకి వస్తున్నారన్నారు. ముఖ్యంగా మంత్రి నారా లోకేష్ ప్రత్యేకించి మైనార్టీల విషయంలో ఎక్కువగా ఆలోచిస్తున్నారన్నారు. అనంతపురాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి కంచుకోటగా మారుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తలారి ఆదినారాయణ, పొట్టూరి హరికృష్ణ, కోనంకి గంగారామ్, పరమేశ్వర్, దలవాయి వెంకటనారాయణ, చేపల హరి, వన్నూరప్ప, డిష్ నాగరాజు, సంపా తేజస్విని, గోపాల్‌గౌడ్, ఇస్మాయిల్, ఓంకార్ రెడ్డి, రియాజ్, పెద్దమారప్ప, దళవాయి, కుమార్, లోకేష్ ఆచారి, పేట్లావలి, రాధా, మణెమ్మ, చౌడమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికే జీపుజాతా

ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ఎం హరున్‌రషీద్

ప్రజాశక్తి-అనంతపురం



కరపత్రాలను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల సాధనకే ఈనెల 3 నుంచి 7వతేదీ వరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జీపుజాతా చేపట్టనున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ఎం హరున్‌రషీద్ తెలిపారు. ఈమేరకు ఆదివారం ఉరవకొండలో జీపుజాతాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌కెయు, జెఎన్‌టియు, సెంట్రల్ యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. వీటితోపాటు జిల్లావ్యాప్తంగా విద్యారంగంలో అనేక సమస్యలు నెలకొన్నాయన్నారు. వాటన్నింటిని పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జీపుజాతా చేయనున్నట్లు తెలిపారు. ఈ జాతాలో విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు రాజేష్, నాయకులు అభిషేక్, పవన్, అరవింద్, పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తెప్పోత్సవం

ప్రజాశక్తి-శింగనమల



తెప్పోత్సవంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ, కుటుంబ సభ్యులు

మండల కేంద్రంలోని రంగరాయుల చెరువులో గోల్కొండ వెంకటరమణ స్వామి తెప్పోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా సాగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కుటుంబ సమేతంగా హాజరై వెంకట రమణస్వామి, ఆత్మారాములు, శివపార్వతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత అర్చనలు, గంగపూజ చేసి తెప్పోత్సవం చేశారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు, శింగనమల, బుక్కరాయసముద్రం సిఐలు కౌలుట్లయ్య, పుల్లయ్య ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ భాస్కర్, మార్కెట్ యార్డు ఛైర్మన్ దండు శ్రీనివాసులు, టిడిపి మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ, సింగిల్‌విండో ప్రెసిడెంట్ గుర్రం లక్ష్మీనారాయణ, నాయకులు జి.సత్యనారాయణ, ఎం.ఆదినారాయణ, మారుతీనాయుడు, అనిల్‌కుమార్‌యాదవ్, కాయల రాజశేఖర్‌యాదవ్, చలమయ్య, రామాంజనేయులు, ఏకల ఆదినారాయణ, రంగారెడ్డి, చిన్న జలాలపురం సుధాకర్, బండి పరశురాముడు, పుల్లయ్య, రమేష్, నాగేష్, సత్తి, శివ, బాలకృష్ణ మాసూలు చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు రానీయొద్దు

ఎమ్మెల్యే పరిటాల సునీత

ప్రజాశక్తి-ఆత్మకూరు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

కార్తీకమాసంలో మండలంలోని పంపనూరు సుబ్రమణ్యస్వామి క్షేత్రానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశించారు. ఆదివారం పంపనూరు క్షేత్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే సుబ్రమణ్యేశ్వర స్వామి, మంజునాథ స్వామి, పార్వతి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యేతో ప్రత్యేక పూజలు చేయిడంతోపాటు ఆశీర్వచనాలు అందజేశారు. తర్వాత భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా కార్తీక మాసం కావడంతో భక్తులు ఎక్కువగా రావటాన్ని గమనించి సౌకర్యాలపై భక్తులను అడిగి తెలుసుకున్నారు. అత్యంత పవిత్రమైన కార్తీక మాసంలో భక్తులు ఎక్కువగా వస్తుంటారని అందుకు తగిన విధంగా ఏర్పాట్లు ఉండాలని అధికారులను ఆదేశించారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరం

ప్రజాశక్తి-రాయదుర్గం



మొక్కలు నాటుతున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

జాతీయ సేవా పథకం-1 కింద పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు నిర్వహించిన ప్రత్యేక శిబిరం ఆదివారం ముగిసింది. ఇందులోఁఉ భాగంగా చివరి రోజు ఆదివారం ఉన్నత పాఠశాల ఆవరణ, మద్దానేశ్వర స్వామి ఆలయ రహదారికి ఇరువైపులా మొక్కలు నాటారు. అనంతరం జరిగిన ముగింపు సభలో కళాశాల ప్రిన్సిపల్ విజయలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయిని హేమలత, ఆలయ కమిటీ అధ్యక్షులు బసవరాజు తదితరులు మాట్లాడుతూ విద్యార్థులు వారం రోజులపాటు గ్రామంలో అనేక ప్రజా ఉపయోగ కార్యక్రమాలు చేపట్టడం హర్షణీయమన్నారు. విద్యార్థులు సేవతోపాటు విద్యలో రాణించి తల్లిదండ్రులు, కళాశాలకు పేరుప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉడేగోళం సింగిల్‌విండో మాజీ అధ్యక్షులు జయన్న, కళ్యాణ మండపం కమిటీ అధ్యక్షులు అప్పాజీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఓబులేసు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, అధ్యాపకులు వీరేష్, శ్రీనివాసులు, ఎర్రన్న, సుబ్రమణ్యస్వామి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా మంత్రి లోకేష్ పర్యటన ఏర్పాట్లు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్



సమావేశంలో చర్చిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కనకదాస జయంతి సందర్భంగా ఈనెల 8న పట్టణంలోని కంబదూరు రింగ్‌రోడ్డులో ఏర్పాటు చేసిన కనకదాస విగ్రహావిష్కరణకు విచ్చేస్తున్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. ఈమేరకు ఆదివారం స్థానిక ప్రజావేదికలో మంత్రి ప్రోగ్రామ్ కోఆర్డినేటర్లతో సమావేశం నిర్వహించి సలహాలు, సూచనలు అందించారు. ఎక్కడి నుంచి మంత్రి పర్యటన చేయాల్సి ఉంటుంది, సభావేదిక ఎక్కడ, ఎంతమంది జనం హాజరయ్యే అవకాశాలుంటాయనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా కూటమి సంఘం రాష్ట్ర నాయకులు బోరంపల్లి ఆంజనేయులు, డీకే రామాంజనేయులు, నాగరాజు, పలువురు ఉద్యోగులు ఎమ్మెల్యేతో సమావేశమై విగ్రహావిష్కరణ కార్యక్రమంపై చర్చించారు.

నిరుద్యోగ అంతమే పంతం : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-గుంతకల్లు



జెండాను ఎగురవేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

నిరుద్యోగాన్ని అంతం చేయడమే తమ పంతమని డివైఎఫ్ఐ పట్టణ ప్రధాన కార్యదర్శి సురేంద్రబాబు అన్నారు. డివైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని హంపిరెడ్డి భవనంలో డివైఎఫ్ఐ మాజీ నాయకులు వై.శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి కసాపురం రమేష్ కలిసి పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సురేంద్రబాబు మాట్లాడుతూ 1980 నవంబర్ 1, 2, 3వ తేదీల్లో పంజాబ్ రాష్ట్రంలోని లూథియానా గ్రామంలో డివైఎఫ్ఐ ఏర్పడిందన్నారు. అప్పటి నుంచి అందరికీ విద్య, ఉపాధి లక్ష్యంగా దేశవ్యాప్తంగా పోరాడుతోందన్నారు. తాము అధికారంలోకి వస్తే ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన ప్రధాని నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చాక ఉన్న ఉద్యోగాలు పోయేలా చేశాడని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు పరం చేస్తూ అంబానీ, అదానీలకు దేశ సంపదను దోచిపెడుతున్నాడని ఆరోపించారు. విభజన హామీలులో ప్రధానమైన కడప, విశాఖ ఉక్కును కేంద్రం పూర్తిగా విస్మరించిందన్నారు. కడప ఉక్కు, కుద్రేముక్ పరిశ్రమలు వస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలమందికి ఉద్యోగాలు వస్తాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా ప్రతి నిరుద్యోగికీ ఏడాదికి 3వేలు నిరుద్యోగ భృతి కల్పిస్తామని హామీ ఇచ్చారని, అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా హామీ అమలుకు నోచుకోలేదన్నారు. విభజన హామీల సాధన, ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్ల కోసం ఎన్నికల హామీల అమలు కోసం పోరాటాలు సాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు చంద్ర, షాషా, వంశీ, రంగా, ఎర్రిస్వామి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను అడ్డుకుందాం

ప్రజాశక్తి-కుందుర్పి

కోటి సంతకాల సేకరణలో వైసిపి నాయకులు



కుందుర్పి మండలంలో సంతకాలు సేకరిస్తున్న వైసిపి నాయకులు

కోటి సంతకాల సేకరణతో మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను అడ్డుకుందామని మాజీ ఎంపీ, నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త తలారి రంగయ్య పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధిలోని అప్పిలేపల్లి గ్రామంలో కోటి సంతకాల సేకరణ-రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రయివేటీకరించేందుకు పూనుకోవడం బాధాకరమన్నారు. మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరిస్తే పేదింటి విద్యార్థులు వైద్య విద్యకు దూరం అవుతారన్నారు. కావున ప్రతి ఒక్కరూ ఈ విధానాన్ని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల కన్వీనర్ హనుమంతరాయుడు, నాయకులు భీమప్ప, అతావుల్లా, ఎన్.తిప్పేస్వామి, ఎస్.బాబు, సి.మర్రిస్వామి, నాగలక్ష్మి, శ్రీనివాసులు, ఎఆర్ వన్నూరురెడ్డి, మంజునాథ, మారుతీశ్వర రామమూర్తి, హనుమేష్, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ వైసిపి మండల కన్వీనర్ పొన్నపాటి మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని గరుగు చింతలపల్లి, కోమటికుంట్ల గ్రామాల్లో కోటి సంతకాల సేకరణ, రచ్చబండ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అబ్జర్వర్ క్రిష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, రామ్‌మోహన్‌రెడ్డి, శివరామ్‌రెడ్డి, మనోహర, రాజశేఖర్‌రెడ్డి, సాంబశివారెడ్డి, భోగేశ్వర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, రంగనాథ్‌రెడ్డి, శ్రీరాములు, రమేష్, విశ్వనాథ్, వెంకటరాముడు, పోల్‌రెడ్డి, ఆదినారాయణ, ఓబుళరెడ్డి, కామేశ్వరరెడ్డి, రామాంజులరెడ్డి, రాజు, శివ, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : మండల పరిధిలోని చెన్నంపల్లి గ్రామంలో వైసిపి నాయకులు కోటిసంతకాలు సేకరణ, రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో వైసిపి మండల నాయకులు గువ్వల రాజశేఖర్‌రెడ్డి, గువ్వల వెంకటరెడ్డి, ఎంపిటిసి నాగయ్య, ఇల్లూరు భాస్కర్‌రెడ్డి, పాలగిరి లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

బెలుగుప్ప : మండల కేంద్రంలోని వైసిపి మండల కన్వీనర్ శ్రీనివాసులు స్వగృహంలో వైసిపి ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాలు సేకరణ, రచ్చబండ కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు చిన్న మచ్చన్న, నాయకులు బి.శివలింగప్ప,. శ్రీనివాసులు, పురుషోత్తం, రాజు, బాబురెడ్డి, భీమన్న, పాతన్న, నరుగన్న, అంగడి స్వామి, కరుణాకర్, రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

12వ పిఆర్‌సి కమిషన్‌ను పునరుద్ధరించాలి

యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు రామప్పచౌదరి

ప్రజాశక్తి-అనంతపురం



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

12వ పిఆర్‌సి కమిషన్‌ను పునరుద్ధరించడంతోపాటు 29 శాతం ఐఆర్ ప్రకటించాలని, ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలు చేసి పదోన్నతులు కల్పించాలని యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు రామప్పచౌదరి, జిల్లా కోశాధికారి రాఘవేంద్ర డిమాండ్ చేశారు. యుటిఎఫ్ మండల అధ్యక్షులు పావన మురళి అధ్యక్షతన ఆదివారం వజ్రకరూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల కౌన్సిల్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2010 కంటే ముందే నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయించాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలు చెల్లించాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం యుటిఎఫ్ వజ్రకరూరు మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కె.రాంబాబు, కె.రాంబాబు, గౌరవాధ్యక్షులుగా కె.శ్రీనివాసగుప్తా, సహాధ్యక్షులుగా కె.శ్రీదేవి, కె.సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా ప్రసన్నకుమార్, కోశాధికారిగా ఎం.వేణుగోపాల్, కార్యదర్శులుగా రామచంద్రనాయక్, రామచంద్ర, వి.మోహన్, ఎం.షాలెం, ఎస్.మధుబాబు, ఎం.ఆంజనేయులు, ధనుంజయవర్మ, భాగ్యరేఖ, కె.శివ, మాహబూబ్‌బాషా, జిల్లా కౌన్సిలర్లుగా పి.నరసింహులు, అశోక్‌కుమార్, శైలజ, జానకిరాములు, మైలార్ లింగ, శ్రీధర్, వెంకటేశులు, మోహన్‌బాబు, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా సంతోష్, సభ్యులుగా రాము, అరుణను ఎన్నుకున్నారు.

మాజీమంత్రి జోగి రమేష్ అరెస్టు అన్యాయం

అనంతపురం : మాజీమంత్రి జోగి రమేష్ అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయంని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం ఉరవకొండలోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాల నుంచి దృష్టి మళ్లించడానికి జోగి రమేష్‌ను అన్యాయంగా అరెస్టు చేశారని ఆరోపించారు. వైసిపి నేతలను అరెస్టు చేసి చంద్రబాబు, లోకేష్ పైశాచిక ఆనందం పొందుతున్నారన్నారు. మీరు చేసే ప్రతి పనికీ రాబోయే రోజుల్లో మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు వీరన్న, ఈడిగ ప్రసాద్, మూలగిరిపల్లి ఓబన్న, రాజేష్, మల్లికార్జున పాల్గొన్నారు.

మొక్కలు పంపిణీ

రాయదుర్గం : గుమ్మగట్ట మండలం 75 వీరాపురం గ్రామంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఆదివారం ఇంటింటికీ వెళ్లి మొక్కలు పంపిణీ చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం 3వ యూనిట్ ప్రత్యేక శిబిరం కార్యక్రమంలో భాగంగా 6వరోజు వాలంటీర్లు వివిధ రకాల మొక్కలు అందజేసి పచ్చదనం పెంపొందించాల్సిన ఆవశ్యకతను వివరించారు. అనంతరం గ్రామంలోని పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నారాయణ, సర్పంచు నాగరాజు, కళాశాల అధ్యాపకులు కిరణ్, విజయ్‌కుమార్, లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్ ప్రశాంత్, నాగరాజురెడ్డి, గ్రామస్తులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

వృద్ధ మహిళకు సాయం

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు, పుట్టినిల్లు ఆశ్రమం ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలమురళి రెండు నెలలకు సరిపడా నిత్యవసర సరుకులను వృద్ధ మహిళ రమణమ్మకు ఆదివారం అందించారు. ఈ సందర్భంగా నిర్మలమురళి మాట్లాడుతూ నగర శివారులో నివాసం ఉంటున్న రమణమ్మ ఇటీవల కింద పడి ఎడమ చేయి విరిగింది. దీంతో ట్రస్టు సభ్యులు రఘునాథ్ వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యుల సహకారంతో నిత్యావసరాలు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సౌధామణి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ వెంకటేశ్వర డీటైలింగ్ హబ్ ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం



డీటైలింగ్ హబ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పయ్యావుల

అనంతపురంలోని రుద్రంపేట సర్వీస్ రోడ్డులో డీ.మార్ట్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ వెంకటేశ్వర డీటైలింగ్ హబ్‌ను ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న అనంతపురం జిల్లాలో ఉపాధి కల్పన వైపుగా వ్యాపారంగం వృద్ధి చెందాలని ఆకాంక్షించారు. వ్యాపార సంస్థ నెలకొల్పి ఎంతో మందికి ఉపాధి కల్పిస్తున్న యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. శ్రీవెంకటేశ్వర మోటార్స్ మేనేజింగ్ పార్ట్‌నర్లు గాజుల రాంప్రసాద్, సిఎస్.సందీప్ మాట్లాడుతూ ఆటోమొబైల్స్ రంగంలో రెండు దశాబ్దాలుగా అనంత ప్రజలకు నాణ్యమైన సేవలను అందిస్తూ ఆదరణ పొందామన్నారు. మరింత మెరుగైన సేవలు అందించేందుకు పూర్తిస్థాయి ఎక్విప్‌మెంట్‌తో షోరూమ్‌ను రూపొందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు పిఎల్ఎన్.రెడ్డి, పలువురు వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులుపాల్గొన్నారు.

బ్రెయిన్ స్ట్రోక్‌పై అశ్రద్ధ వహించొద్దు

న్యూరో ఫిజీషియన్ టివి కృష్ణకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం



ప్రస్తుత కాలంలో వయసుతో సంబంధం లేకుండా వస్తున్న బ్రెయిన్ స్ట్రోక్‌పై అశ్రద్ధ వహించొద్దని రామ్‌నగర్‌లోని తిరుమల మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి డాక్టర్ టివి కృకష్ణకాంత్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ బ్రెయిన్ స్ట్రోక్‌లు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అవగాహన ప్రతి ఒక్కరికీ తెలియాల్సిన అవసరం ఉందన్నారు. పక్షవాతం వచ్చినప్పుడు రక్త సరఫరా ఆగిపోవడం వల్ల ప్రతి నిమిషం 1.9 మిలియన్ల నరాలు మెదడులో చనిపోతూ ఉంటాయన్నారు. పక్షవాతం లక్షణాలను సులువుగా గుర్తించవచ్చన్నారు. చూపులో కలిగే లోపం, మూతి వంకరపోవడం, చేతులు, కాళ్లు చచ్చుపడటం, మాట తడబాటు పడటం వంటివి పక్షవాతం లక్ష్యణాలు అన్నారు. వీటిలో ఏ లక్షణం ఉన్నా వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. మొదటి 4, 5 గంటల్లో చికిత్స అందస్తే రోగి త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందన్నారు.

వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

అనంతపురం కలెక్టరేట్ : అనంతపురం రూరల్ పరిధిలోని కురుగుంట గ్రామ పరిధిలో ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్.2, ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఇందులో భాగంగా పలువురికి బిపి, కంటి పరీక్ష, దంత పరీక్ష, ఈసీజీ, రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపాల్ పతికి రమేష్‌నారాయణ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ, ఎస్సార్ ఎడ్యుకేషన్ సొసైటీ వ్యవస్థాపకులు సుంకర రమేష్, వైద్యులు గరుగు బాలాజీ, జుగును, వేణుగోపాల్‌రెడ్డి, అఖిల్‌రెడ్డి, నాగేంద్ర, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ టెక్నీషియన్ తిప్పేస్వామి, తదితరులు పాల్గొన్నారు.

'అరుణాచల గ్యారేజ్ సర్వీసెస్' ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి పయ్యావుల

అనంతపురం రుద్రంపేట సర్వీస్ రోడ్డు డి.మార్ట్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన 'అరుణాచల గ్యారేజ్ సర్వీసెస్'ను ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన నమ్మకమైన సేవలను అందించాలని యాజమాన్యానికి సూచించారు. అనంతరం సంస్థ అధినేత ప్రసాద్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, వ్యాపారవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

శిష్యునికి పూర్వ గురువుల చేయూత



బాధితుడిని పరామర్శిస్తున్న పూర్వ గురువులు

శింగనమల : క్యాన్సర్‌తో బాధపడుతున్న శిష్యునికి ఉపాధ్యాయులు ఆర్థికసాయం అందించి చేయూత అందించారు. శింగనమల జడ్పీహెచ్ఎస్ స్కూల్లో 2010 నుంచి 2015 వరకు విద్యనభ్యసించిన వడ్డే మల్లికార్జున క్యాన్సర్‌తో బాధపడుతూ అనంతపురంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు కొండారెడ్డి, మల్లేశ్వర్‌రెడ్డి, వెంకట రమణారెడ్డి, గాయత్రి ఆసుపత్రికి వెళ్లి పూర్వ విద్యార్థిని పరామర్శించారు. అనంతరం వారందరూ కలిసి రూ.25వేలు ఆర్థికసాయం అందజేశారు. అలాగే తన మిత్రుడు భరత్ అలియాస్ చిట్టి (కొర్రపాడు) తనవంతుగా రూ.20వేలు, 10వ తరగతి మిత్రులు అంతా కలిసి రూ.40వేలు అందించి మానవత్వం చాటుకున్నారు.

4న జెవివి మండల స్థాయి చెకుముకి పోటీలు

రాప్తాడు : జన విజ్ఞాన వేదిక మండల కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 4న మండలంలోని గొల్లపల్లి వద్ద ఉన్న మాంటిస్సోరి ఎలైట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో చెకుముకి సంబరాలు నిర్వహించనున్నట్లు జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరరాజు, మండల బాధ్యులు సాకే భాస్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం రెక్టార్ జి.వెంకటనాయుడు ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. వందమంది విద్యార్థులకు ఒక టీం చొప్పున మండలంలోని ఏడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, నాలుగు ప్రయివేట్ పాఠశాలల నుంచి 18 టీంలు పాల్గొననున్నట్లు తెలిపారు. శాస్త్రీయ దృక్పథంపై విద్యార్థుల్లో ఆసక్తి కలిగించాలనే లక్ష్యంతోనే చెకుముకి సంబరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు డయల్ యువర్ ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి

అనంతపురం : ఎపిఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ప్రతి సోమవారం డయల్ యువర్ ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థలో మొట్టమొదటిసారిగా డయల్ యువర్ సిఎండి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, వైయస్సార్ కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల వినియోగదారులు మొబైల్ నెంబరు 89777 16661కు కాల్ చేసి సమస్యలను విన్నవించుకోవాలని కోరారు. ప్రతి సోమవారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఫోన్ చేయవచ్చన్నారు. వినియోగదారులు మొబైల్ నెంబర్ 91333 31912కు చాట్ చేయడం ద్వారా కూడా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చన్నారు.

కార్యకర్తలకు అండగా టిడిపి : విప్

రాయదుర్గం : పార్టీ కోసం కష్టపడి పని చేస్తున్న కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని విప్ కాలవ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం రాయదుర్గంలోని తన స్వగృహంలో బాధిత కుటుంబ సభ్యులకు బీమా మంజూరు ఉత్తరాలను విప్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదంలో మృతిచెందిన ఇద్దరు టిడిపి కుటుంబాలకు ప్రమాద బీమా కింద మంజూరైన రూ.ఐదు లక్షలు నేరుగా ఆ కుటుంబ సభ్యుల అకౌంట్‌లో పార్టీ జమ చేయించిందన్నారు.

విత్తన పప్పుశనగకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

పెద్దపప్పూరు : మండల వ్యాప్తంగా విత్తన పప్పుశనగ కోసం రైతులు మీ పరిధిలోని రైతు సేవాకేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మహిత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

అట్టహాసంగా వాల్మీకి జయంతి ముగింపు వేడుకలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వాల్మీకి ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని రుద్రంపేటలో ఉన్న వాల్మీకి కమ్యూనిటీ హాల్‌లో వాల్మీకి జయంతి ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మహర్షి వాల్మీకి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వివిధ ఉద్యోగాల్లో రిటైర్ అయిన వాల్మీకి ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. అలాగే ఇటీవల వివిధ విభాగాల్లో నూతనంగా ఉద్యోగాలు పొందిన వారికి, అంతర్జాతీయ స్థాయిలో క్రికెట్‌లో రాణిస్తున్న తేజస్వినిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు గంగాధర్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుధాకర్, నారాయణస్వామి, కోశాధికారి కృష్ణమూర్తి, వెంకటేష్, శివయ్య, నరహరి, రమణ, శంకర్, ఆంజనేయులు, రవితేజ, విశ్రాంత ఎస్పీ నరహరి, విశ్రాంత సిఇఒ ఈశ్వర్, వెంకటేశులు, సంగప్ప, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం ఏర్పాటు

అనంతపురం : నగరంలోని జిల్లా ఉద్యాన శాఖ అధికారి కార్యాలయం మూడో అంతస్తులో ఉన్న ఉద్యాన శిక్షణా కేంద్రంలో జిల్లా వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా వ్యవసాయ స్థానాధికారుల సంఘం అధ్యక్షుడిగా బాల మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా జి.ఆదినారాయణ, కోశాధికారిగా శ్వేత, సహాధ్యక్షులుగా ఎన్.ఆంజనేయులు, వైస్ ప్రెసిడెంట్లుగా జోష్ణ, సుజిత, దిలీప్‌కుమార్, జాయింట్ సెక్రటరీలుగా మనోజ్‌కుమార్, భరత్ రాజ్, భాగ్యశ్రీ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రామన్న, పబ్లిక్ సెక్రటరీగా మణికంఠ కుమార్‌తోపాటు ఇసి సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్‌రెడ్డి, సహాయ ఎన్నికల అధికారిగా నరసింహ, అశోక్ వ్యవహరించారు.

నేరాలు ఘోరాలు

గంజాయి విక్రేత అరెస్టు



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న సిఐ శివగంగాధర్‌రెడ్డి

తాడిపత్రి రూరల్ : గంజాయి అమ్ముతున్న వ్యక్తిని రూరల్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. తాడిపత్రి రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సిఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపిన వివరాల మరకు.. రూరల్ పరిధిలోని గన్నెవారిపల్లి కాలనీకి చెందిన షేక్ గఫూర్ అలియాస్ అబ్దుల్‌కపూర్ అనే వ్యక్తి దురుద్దేశంతో ప్రజలను మోసం చేయడం కోసం మోసపూరితమైన మాటలతో ప్రేరేపించి ప్రజల వద్ద నుండి డబ్బులు తీసుకుని మోసం చేసేవాడు. దీనికితోడు గంజాయిని తీసుకొచ్చి దాన్ని నాలుగు గ్రాముల చొప్పున చిన్న ప్యాకెట్లుగా విభజించి రూరల్ పరిధిలోని కడప రోడ్డు ఐశ్వర్య విల్లాస్ వద్ద విక్రయిస్తుండేవాడు. ఈనేపథ్యంలో పక్కాగా అందిన సమాచారంతో గఫూర్‌ను సిబ్బందితో కలిసి దాడి చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితుడి నుంచి 16 ప్యాకెట్లు (64 గ్రాముల) గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మట్కా నిర్వాహకుల అరెస్టు

తాడిపత్రి : పట్టణంలో మట్కా నిర్వహిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు తాడిపత్రి టౌన్ సిఐ ఆరోహణరావు తెలిపారు. తాడిపత్రిలోని శివాలయం పక్కన శ్మశానం రోడ్డులో మట్కా రాస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి మెహతర్ మహమ్మద్ రజాక్, మంగళ వెంకటరమణ, రామును అరెస్టు చేసి రూ60,100 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.